50.97
శ్రీకాకుళం

# మానవుడు మరణిస్తున్నాడు

[కథానాయకుని పరిచయం]

ఏకో వశీ సర్వభూతా న్తరాత్మా
ఏకరూపం బాహుధాయః కరోతి
తమాత్మస్థం యోఽను పశ్యన్తి
ధీరేస్తేషాం సుఖం శాశ్వతం నేతరేషాం

—కఠోపనిషత్తు.

కాలానికి సంకేతం గడియారం. గడియారానికి సంకేతం పీతాంబరం.

పీతాంబరం చాలా సగటువారీమనిషి. అతనిలో ఎవరు చెప్పుకోందుకయినా ఏమీ గొప్పతనం లేదు. గడియారానికి విసుగు లేనట్టే, పీతాంబరానికీ విసుగు లేదు. గడియారం చెడిపోయినట్టే అతనూ, అప్పుడప్పుడు చెడి పోతూ ఉంటాడు. కొద్ది మరమ్మత్తులయితే చేసుకొంటాం, మళ్ళీ గడియారాన్ని ఉపయోగపెట్టుకొంటాం; పీతాంబరంకూడా అలాంటివాడే! మన కవసరమొచ్చినప్పుడు రిపేరుచేసుకొంటాం గానీ, గడియారంమీద జాలి పుట్టి బాగుచేయించం గదా! ఈ విషయం తు. చ. తప్ప కుండా, మన కథానాయకునికీ వర్తిస్తుంది.

పీతాంబరం ఈమధ్య బాగా చెడిపోయాడు. అయినా, పనిచేస్తూనే ఉన్నాడు. అంటే–బాగుచెయ్య వలసినంత 'ఇది'గా పీతాంబరం చెడిపోలేదన్నమాట!

కుక్క-కున్న లక్షణాల్లో కొన్ని అతనిలోనూ ఉన్నాయి. మనుషులమీద ఎంత కసిగాఉంటాడో, అంత విశ్వాసంగానూ ఉంటాడు. అతని కెప్పుడో, పదేళ్ళకిందట ఓ మాలమామ్మ, కడుపునిండా అన్నం బెట్టిందట! ఇప్పటికీ ఆ సంగతి చెప్పుకొని అతను కళ్ళవెంట నీళ్ళు పెట్టుకో గలడు.

'అప్పటికి మూడురోజుల్నించీ నాకు తిండి లేదు. ఊళ్ళో కెళ్ళి వోపిక లేక, మాలక్షుమ్మ చెట్టుకింద పడి పోయాను. నాకు మెలకువవొచ్చేసరికి గుడిసెకప్పు, మంచం పక్కనే మామ్మా కనిపించారు. పాలల్లో పిసికిన అన్నం తినిపించింది మామ్మ. ఆ క్షణాన, ఆ తల్లి చేసిన మహోపకారానికి, ఎన్ని జన్మలెత్తినా నేను రుణం తీర్చుకోలేను' అన్నాడు పీతాంబరం ఒకసారి.

పీతాంబరం జీవితం మురికిగుంటలా తయారయింది. ప్రస్తుతం అందులో క్రిమికీటకాలు తప్ప, మరేమీ లేవు.

పిల్లి లక్షణాలు కూడా కొన్ని పీతాంబరంలో ఉన్నాయి. ఓ ఉద్యోగంలోంచి మరో ఉద్యోగానికి మారాలన్నా, ఓ కొంపలోంచి మరో కొంపలోకి మారా లన్నా–పీతాంబరం ఆత్మ, ఘొల్లుమని గోల పెట్టేది. ఒక్కో సారి పీతాంబరం అది చెప్పినట్టే వినేవాడు. ఒక్కోసారి దానికి అసలేమీ చెప్పలేకపోయేవాడు. అయినా పట్టు

మని పది కాలాలపాటు అత నంటిపెట్టుకొన్న ఉద్యోగమంటూ ఏమీ లేదు. ఎంత నమ్మకంగా అంటిపెట్టుకొనేవాడో, అంత అపనమ్మకంతోనూ బైటికి వచ్చేవాడు. అలలు నురుగును గెంటుకొచ్చినట్టు, పరిస్థితులన్నీ గెంటుకుంటూ వచ్చాయి. అంచాత అన్నిటిని గురించీ అపనమ్మకం, భయం మాత్రమే అతనికి మిగిలిపోయాయి.

అన్నట్టు పీతాంబరానికి పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. పెళ్ళామన్నా, పిల్లలన్నా అతనికి ఎంత ఆపేక్ష ఉందో, అంత నిరాపేక్షకూడా ఉంది....

* * *

గడియారంలాంటి పీతాంబరం, గడియారం అయిదు గంటలు కొట్టటం విన్నాడుగానీ ఆఫీసువిడిచే ప్రయత్నంలో మాత్రం లేడు. అతని కీపూట అర్జంటుగా యాభై రూపాయలు కావలసివచ్చాయి. ప్రొప్రయిటర్ను కలుసుకొని అడుగుదామనుకొంటున్నాడు. కానీ, ఎలా అడగాలో పీతాంబరానికి తోచడంలేదు. తీరా చూస్తే తను జీతం తీసుకొని వారమన్నా కాలేదు. ఇప్పటికప్పుడే ఎడ్వాన్సు అడిగితే ప్రొప్రయిటరు మండిపడతాడు. పోనీ, మండిపడ్డవాడు డబ్బిచ్చినా మాబాగే!

పీతాంబరానికి వాళ్ళ ఆఫీసువారందరూ కలిసి 'దాహార్తి' అని ముద్దుపేరొకటి పెట్టుకొన్నారు. అస్తమానూ పీతాంబరం డబ్బుకోసం యావపడటమే అందుకు కారణం కావచ్చు.

అప్పటికి తన తప్పు లేకుండా, పీతాంబరం తెలిసిన వారందరినీ అడిగి చూశాడు. ఎవ్వరూ ఇవ్వరని తెలిసి కూడా, అతను అడగడం మానలేదు. ఏ క్షణాన ఏం జరిగినా జరగొచ్చనే మచ్చులో వాడు పీతాంబరం.

అంతా వెళ్ళిపోయారని రూఢిచేసుకొన్నాక, పిల్లిలా ప్రొప్రయిటరు ఎదట పడ్డాడు పీతాంబరం. చేతులు నులుపుకుంటూ నిలబడ్డాడు.

'ఏం కథ?' అన్నట్టు కళ్ళెగరేసి "డబ్బా?" అన్నాడు ప్రొప్రయిటరు-అంతలోనే తెప్పరిల్లి.

"మరేనండి!"

"లేదు."

"చాలా అవసరం సార్!"

"లేదయ్యా! చెబుతుంటే వినిపించుకోవేం?" అన్నాడు విసుగ్గా ప్రొప్రయిటరు.

("ఎందుకురా వెధవా, అంత విసుగు? మెల్లిగా చెప్పరాదుట్రా!" అనుకొన్నాడు పీతాంబరం చాలా రహస్యంగా)

"తమరే అలా అంటే నేనేం కావాలి సార్, మిమ్మల్ని నమ్ముకొని ఉన్నవాణ్ణిగదా!" అన్నాడు పీతాంబరం-మరీ వినయంగా.

"నీకేం జీతం బాకీ లేదే!" అన్నాడు ప్రొప్రయిటరు.

("ఓరి భ్రాష్టుడా! ఏమిరా నీ తెలివి!!" అనుకొన్నాడు పీతాంబరం.)

ఆ నిముషాన అతని కళ్ళముందు, అందమైన బొమ్మొకటి మెరిసింది.

(ఆఫీసులో ఎవ్వరూ లేరు. ఇనప్పెట్టె దగ్గర ప్రొప్రయిటరొక్కడే కూచుని, నోట్లు లెక్కపెట్టుకొంటున్నాడు. పీతాంబరం నల్లముసుగు వేసుకొని-వెనగ్గావొచ్చి, కత్తితో పొడిచాడు. ప్రొప్రయిటరు 'అమ్మా!' అనకుండా నోరు నొక్కేశాడు. నోట్లన్నీ జేబుల్లో నింపుకొన్నాడు. నల్లముసుగు అక్కడే పడేశాడు. దర్జాగా బైటికొచ్చేశాడు. రిక్షా ఎక్కి, రైలెక్కి, విమానమెక్కి, అమెరికా వెళ్ళి...)

"చెప్పాగా!" అన్నాడు ప్రొప్రయిటరు.

బొమ్మ చెదిరిపోయింది.

"మీకు తప్పదు సార్!" అన్నాడు పీతాంబరం.

("ఒరే లుచ్చా! నీ అంత డబ్బు నాకే ఉంటే, ఎడంచేత్తో పారేసేవాణ్ణిగా" అనుకొన్నాడు పీతాంబరం.)

ప్రొప్రయిటరు తలొంచుకొని ఇంకేదో పని చూసుకొంటున్నాడు.

ఆకస్మికంగా పీతాంబరానికి ప్రొప్రయిటరు పెళ్ళాం జ్ఞాపకంవొచ్చింది. (పలచగా, ఎర్రగా, పొడుగ్గా ఉంటుంది. ఎంత బావుంటుందని! ఈ రాక్షసుడు దాన్ని కౌగలించుకొని, కాళ్ళు మెలికవేసి, చేతుల్తో బిగించి—)

"సరే రేపుఉదయం పట్టుకెళ్ళవయ్యా!" అన్నాడు ప్రొప్రయిటరు తలెత్తకుండానే.

"చిత్తం సార్!" అని గొణుక్కొన్నాడు పీతాంబరం.

పీతాంబరం కొడుక్కు జ్వరంగా ఉంది. ఇట్టే దిగ జారిపోయిందనుకొన్న జబ్బు, ఎగబాకుతోంది. పీతాంబరంభార్య మొగుడు ఇంటికి రాగానే "డబ్బు తెచ్చారా?" అని అడిగింది.

("నీ నోరు పడా, ఎంత జ్ఞాపకమే నీకు" అనుకొన్నాడు పీతాంబరం.) "దొరకలేదు అమ్మడూ! రేపు తెస్తాను" అన్నాడు.

"బాబుకి జ్వరం పెరిగింది." అన్నది భార్య.

"అన్నం పెట్టావా?" అన్నాడు పీతాంబరం.

"రొట్టె కావాలన్నాడు" అన్నది భార్య.

("నీజన్మ తగలెయ్య! అడిగింది తప్ప అన్నీ చెబుతావు" అనుకొన్నాడు పీతాంబరం) "పెట్టావా?" అన్నాడు పైకి-తన కొడుకు వేపు చూస్తూ.

"డబ్బు లేదు" అన్నది భార్య. అని ఇంట్లోకి వెళ్ళింది.

('పిరుదులు ఎంత అసహ్యంగా కదుల్తున్నాయి. పొడుగ్గా పమిటన్నా వేసుకు చావకూడదూ!' అనుకొన్నాడు పీతాంబరం.)

పీతాంబరం బీడీ ఆర్పి, మంచంకోడుకి ఆనించి, దుప్పటి మెడదాకా కప్పుకొని, కళ్ళు మూసుకొన్నాడు. బాబును పక్కలో వేసుకొని భార్య పడుకొంది. పీతాంబరం మనస్సు కట్లు తెంచుకొంది... అటూ ఇటూ తొంగి చూసింది. ఎవ్వరూ లేరని రూఢిచేసుకొన్నాక, విహారానికి బయలు దేరింది.

("డియర్!" అన్నది లత.

"ఏమిటి లతా?" అన్నాడు పీతాంబరం.

"నిన్న రాలేదేం?" అన్నది లత.

"తీరలేదు...." అన్నాడు పీతాంబరం.

"రాత్రి నీ కోసం—" అని ఆగిపోయింది లత.

"నాకు తెలుసు" అన్నాడు పీతాంబరం.

"ఇటు తిరుగు డియర్!" అన్నది లత.

పీతాంబరం తిరిగాడు. లత అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి, తలను దగ్గరగా లాక్కుంది. ఆమె గట్టి రొమ్ముల్ని గట్టిగా వొత్తుకొన్నాడు పీతాంబరం. ఆమె అతనిమీద కాలు వేసింది....)

లత పక్కింటి ప్లీడరుగారమ్మాయి. లతంటే పీతాంబరానికి చాలా ఇష్టం. అనేకసార్లు లతకూ, తన భార్యకూ పోలికలు వేసుకొన్నాడు పీతాంబరం! భార్యను ముద్దుపెట్టుకొన్నప్పుడల్లా, అతని కళ్ళముందు లత బుగ్గ మెదిలేది! ఒకసారి 'చాలా బాగున్నావు లతా!' అనేశాడుకూడా!

లత తరచుగా వాళ్ళింటి కొస్తుంటుంది. ఆవిడ కూచున్నచోట - ఎవ్వరూ చూడకుండా కూచునేవాడు పీతాంబరం. ఆవిడ కాఫీ తాగిన గ్లాసును జాగ్రత్తగా గది లోకి పట్టుకెళ్ళి, ఆవిడ పెదిమలంటినచోట, తనూ పెదిమ లంటించేవాడు పీతాంబరం. ఒకసారి, మొగుడికి చూపెడ దామని-పీతాంబరం భార్య, లత జాకెట్టును తెచ్చింది.

"ఇదిగో చూశారూ?" అన్నది భార్య.

('ఏమిటే నీబొంద నిన్ను చూసేది ముసిలి డొక్కా!' అనుకొన్నాడు పీతాంబరం.)

"ఏమిటమ్మడూ అది!" అన్నాడు పీతాంబరం.

"ఈ జాకెట్టు చూడండి ఎంత బావుందో!" అన్నది భార్య.

("ఓసి నా కనకమే ! ఇప్పుడు నీ మొఖానికి ఈ జాకెట్టే తక్కువయిందన్నమాట !" అనుకొన్నాడు పీతాంబరం.)

"చాలా బావుంది అమ్మడూ! ఎవరిదోయ్ ఇది?" అన్నాడు పీతాంబరం.

"లతదండీ!" అన్నది భార్య.

("ఓరిబాబోయ్, పేరెత్తితేనే బుసలుకొడుతున్నాడే మనిషి?" అనుకొంది భార్య.)

"బావుంది... ఎక్కడ కొన్నదో అడుగు, రేపు పట్టుకొస్తాను" అన్నాడు పీతాంబరం.

("నిన్ను ఏడుపుతా లేసినా ఆ అందం వొస్తుందిటే!" అనుకొన్నాడు పీతాంబరం.)

"అలాగేలెండి.... రేపుమాత్రం తేవడం మరిచిపోకండి" అన్నది భార్య.

("నా పిండం తెస్తాడు. నా కామాత్రం బొంద పోకిళ్ళు తెలియవనుకొంటున్నాడల్లేఉంది. హాయ్యో రాత!" అనుకొంది భార్య.)

భార్య అటు వెళ్ళాక, పీతాంబరం ఆ జాకెట్టు తీసుకొన్నాడు. రెండు చేతులతోనూ, ఇష్టంవచ్చినట్టు నలిపేశాడు. ముఖాని కద్దుకొన్నాడు. ముద్దుపెట్టుకొన్నాడు.

"హమ్మయ్య!"

పీతాంబరం గాఢంగా నిట్టూర్పు విడిచాడు.

అతని నడకగూడా చిత్రంగా ఉండేది. నడుస్తూ నడుస్తూ, తనలో తనే, ఏదో అనుకుంటూ ఉండేవాడు. పక్కగా ఎవరన్నా మనిషి రాగానే, తను అనుకొంటున్న మాటల్నే ఓ పాటకింద మార్చేసి "ఆహాహా లారలప్ప, ఓహోహో టిరిటెట్టె" అని పాడేవాడు.

అతని కప్పుడప్పుడు బాగా పాడాలనిపించేది. ఒంటరిగా ఉన్నప్పుడు పాడాలన్న ఉత్సాహం అతనిలో కట్టలు తెంచుకొని ఉరుకుతూ ఉండేది.

జగ్గినిక్క జాయిరే, జగ్గినిక్క జాయిరే,
జగ్గినిక్క, జగ్గినిక్క, జగ్గినిక్క హోయిరే....
ఎర్ర ఎర్రాటిదాన, ఎత్తుపిర్రాలదాన
ఎత్తు పిర్రాలమీద, వెండి మువ్వాలదాన
ఝాంచక చకచక జగ్గినిక్క జాయిరే
జగ్గినిక్క జగ్గినిక్క, జగ్గినిక్క హోయిరే—

చిటికెలు వేస్తూ, మధ్య మధ్య కనుబొమ్మలు ఎగరేస్తూ బూతుపాటలు పాడటమంటే, పీతాంబరానికి ఎంతో ఇష్టం!

ఉన్నంతసేపూ మనస్సు పనిమీద ఉండేది. అలా ఉంటూ ఉంటూనే, ఒక్కోసారి తుర్రుమని జారుకొంటూ

ఉండేది. పీతాంబరానికి ఎందుకనో మాటిమాటికీ ఈ పాట జ్ఞాపకంవస్తూఉండేది.

ఒకటి రెండు మూడు నాలు
గైదు మైళ్ళ రాయికాడ
అప్పారావు మేడకాడ
గుండె జల్లు మన్నాదే బుల్లా_
అబ్బ! నాగుండె జల్లు మన్నాదే రవణా!

మరెవరో వచ్చి గట్టిగా అరిచిందాకా, అతను మామూలు మనిషి అయ్యేవాడుకాదు.

"ఏమిటోయ్ ఆలోచిస్తున్నావ్!" అని ఎవరన్నా అంటే, పీతాంబరం తమాషాగా నవ్వేవాడు.

("గాడిద గుడ్డు! నీ కెందుకురా మలపనాయాల, నీపని నువ్వు చూసుకోక!" అనుకోనేవాడు పీతాంబరం.)

"ఏం లేదు బ్రదర్, కుంటుబం గొడవ!" అనేవాడు పీతాంబరం.

"అందరికీ లేవుటోయ్ కుటుంబాలు! నీఒక్కడికే ఉన్నట్టు మాట్లాడతావేం!" అంటే__

("నీపెళ్ళాం అందంగా ఉంటుందిరా నాన్నా! ఎవడికి కన్నుగొట్టినా ఘల్లుమని పాతిక పడతై" అనుకొనేవాడు పీతాంబరం.)

"నాయనా! అందరి సమస్యలూ వేరు__నా సమస్యలు వేరు, సరేనా!" అని మర్యాదగా పంపించేసేవాడు పీతాంబరం.

తన భార్య చక్కనిది కానందుకూ, అంతో ఇంతో చక్కగా ఉన్నందుకూ గూడా, పీతాంబరం అప్పుడప్పుడు విచారించేవాడు.

"ఆ సీతాపతి పెళ్లాం ఉన్నట్టయినా ఉండగూడదా?" అనుకొనేవాడు అనేకసార్లు.

మళ్ళీ తనుచేసేదీ, వాడుచేసేదీ ఒక్కటేపని! వాడికి రొండొందలపాతిక. తనకు? నూటముప్ఫయ్‌నాలుగు! అనేక సార్లు ప్రొప్రయిటరు, సీతాపతిఇంటికెళ్ళటం తనకు తెలుసు. ఇంటికెళ్ళి వీ డేం చేసేవాడో....? ఇంకేం చేస్తాడు! వెళ్ళం గానే, ముందు వీధితలుపు లేస్తారు. వేసీవెయ్యకముందే, వీడు దాన్ని కావలించుకొంటాడు. అది తప్పుకొని గదిలో కెడు తుంది, వీడూ రొప్పుకొంటూ గదిలో కెడతాడు.... ఓహ్ అక్కడ రంగ రంగ వైభవంగా, దాన్ని వీడూ, వీణ్ణి అదీ, లాక్కుంటూ, పీక్కుంటూ, వొత్తుకొంటూ, రొప్పు కొంటూ ...

ఈ గాడిద, ఇక్కడ వోచర్లు రాస్తూనే ఉంటాడు, అయ్యగారు "మాటినీ" కెళ్ళి రానేవస్తాడు... అడిగినప్పుడు అడిగినంత డబ్బు. సెక్షనంతా సీతాపతి చేతిలో ఉంది. వా డెంత చెబితే అయ్యగా రంత!

"ఇక నీగీచిన గీటు దాటనని...."

నాయనా! నాదనామక్రియ వాయించవోయ్!

"తిమ్మిరి బిళ్ళ, తిమ్మిరి బిళ్ళ ..."

కాండ్రించి వూసేవాడు పీతాంబరం. సీతాపతిగాడి కి మాత్రం తెలీదా, తన పని చూసే అంత జీతమిస్తున్నారని

అనుకోడమెలా? ఇంటికెళ్ళంగానే, పెళ్లాం కనిపించంగానే, దాని ముఖం చూడంగానే, ఈ బుగ్గలు వాడు తాకాడు, ఈపెదిమలు వాడు ముద్దెటుకొన్నాడు, ఈమెడ వాడిభుజం మీాదవాలింది, ఈ చేతులు వాణ్ణి కావలించుకొన్నాయి, ఈ తొడలమీాద వాడిపూపులు పాకాయి.... ఇవన్నీ సీతా పతిగాడికి జ్ఞాపకంరావా అని! కోపంతో గుండె గుబగుబ లాడిపోదా అని! కడుపులో బడబాగ్ని పెల్రేగిపోదా అని? నాపలా, అనాథలా, ముండాతి ముండాతి ముండలా, ప్రాప్ర యిటరు తన పెళ్లానికిచ్చిపోయిన నోట్లందుకొని, లెక్కసరి చూసుకొని, పెట్టెలో దాసుకొని, కళ్లు మూసుకొని, కాళ్లు చాచుకొని....

"సీతాపతీ నీకు చాపేగతీ! అహ, చాపేగతీ, నాప రాయే గతీ!"

ఓసారి పీతాంబరం ఇంటికి రాగానే, భార్య కళ్ళంట నీళ్ళెట్టుకొని "ఇల్లు మారదామండీ!" అన్నది.

("నీ నోట మట్టిగొట్ట. నువ్వెక్కడా ఇమడవేమే?" అనుకొన్నాడు పీతాంబరం)

"ఎందుకని అమ్మడూ?" అన్నా డతను.

"జులాయి వెధవలపక్క ఎంతకాలమని ఉంటాం చెప్పండీ!" అన్నది భార్య.

పీతాంబరం ఛర్రుమన్నాడు.

" మీారు ఉన్నవేళుంటుంది " లేనివేళుంటుంది! రౌడీల మధ్య ఒంటరిగా..." అన్నది భార్య, చీమిడిటీసి, గోడకేసి, ఆ వేళ్ళను తలుపుకు రాస్తూ.

("నీ మొఖం చూసి ఆశపడేదెవరే పతివ్రతా తిల కమా!" అనుకొన్నాడు పీతాంబరం.)

"ఏం జరిగిందేమిటి?" అన్నాడతను.

"ఇందాక ఇంటివారబ్బాయొచ్చి, పాడు పోకిళ్ళన్నీ పొయ్యాడు" అన్నదామె కుళ్ళికుళ్ళి ఏడుస్తూ.

అప్పటికప్పుడే, తన భార్యశీలం భ్రష్టమయిందని పించింది పీతాంబరానికి. పాడు పోకిళ్ళన్నీ పొయ్యాట్ట... అంతవరకూ తెగించినవాడు, ఆమీదట ఉత్తినే ఉండిపోతా డంటే నమ్మడమే?

ఆ పట్టు పట్టు వారం రోజులదాకా పీతాంబరం, భార్యతో సరిగ్గా మాట్లాడనేలేదు...

పీతాంబరంభార్య అప్పుడప్పుడు నిద్దర్లో కలవరించేది.

"ఉహూ... వదులు, వదులు" అనేది.

ఆమాటలు అతనిగుండెల్లో, బాకుల్లా దూసుకెళ్లేవి. మెల్లగా మంచందగ్గరకూచుని, నిద్రపోతున్న పెళ్ళాంమొఖం లోకి అదేపనిగా చూసేవాడు... గొంతు కసాపిసా నులిమి, ఎటన్నా పారిపోతే—పోలీసులకు పట్టుబడితే?

ఆఫీసులో లాభనష్టాల స్టేట్‌మెంట్ చూసినప్పు డల్లా, పీతాంబరానికి భార్య జ్ఞాపకంవచ్చేది. ఈ పెళ్ళాం వల్ల తనకు లాభమా? నష్టమా? అని ప్రశ్నించుకొని, రక రకాల సమాధానాలు చెప్పుకొనేవాడు. తొలిరోజుల్లో వేసు కొన్న అంచనాలకూ, ఇప్పటి అంచనాలకూ మధ్య, బొత్తిగా పోలికలేలేవు. అప్పట్లో జమల కాలంలో అపా రంగా అంకెలుండేవి. బేరీజువేస్తే-కట్టుకుపోయినంత లాభం కనిపించేది. ఇప్పుడుదానికి ఫక్తు వ్యతిరేకం! అన్నీనష్టాలే!

అన్నీ ఖర్చులే!! ఈ పెళ్లాంవల్ల—ఏ పెళ్లాంవల్లనైనా సరే, లాభంకన్నా నష్టమే జాస్తి! వీళ్ళవల్ల మగవాడికి స్వేచ్ఛ ఉండదు: కొంపకు బందీ అయిపోతాడు. అందుబాటులో పెళ్ళాం ఉంటుంది, పిల్లల్ని కంటాడు, మరోబంధం; వాళ్ళ చదువులు, ఇంకో సంబంధం: వాళ్ళ పెళ్ళిళ్ళు, మరోముడి పడుతుంది: వాళ్ళసంతానం-మళ్ళీ వాళ్ళ చదువులు, వాళ్ల పెళ్ళిళ్ళు, ఇంకా బంధం, ఇంకాఉరి, ఇంకాబురద, ఇంకా లోతు, ఇంకా చీకటి, అనంతం—మహా ప్రభో, ఇది అనంతం....

కానీ, లతను చూసినప్పుడు, పీతాంబరానికి ఇవన్నీ జ్ఞాపకంఉండేవిగాదు.

పీతాంబరంభార్య పుట్టింటికెళ్ళింది. బండెక్కించి వచ్చాక—వచ్చేప్పుడు, అతని ప్రాణానికెంతో హాయిగా ఉంది. జైలునుంచి విడుదలైనంత ఆనందం పొందాడు. హోటల్లో భోజనంచేసి, ఇంటికొచ్చాడు. లైటువేసుకొని, మంచంమీద పడుకొన్నాడు. ఇల్లంతా బావురుమంటున్న ట్టుగా ఉంది! ఇందాక తను భావించిన ఆనందమేదీ ఇప్పుడు కనిపించలేదు. పిచ్చిగా ఇల్లంతా కలియదిరిగాడు. పెళ్లామూ, తనూ కలిసి, తీయించుకొన్న ఫొటోవేపు చాలాసేపు చూశాడు. పెళ్ళాం బొమ్మను ముద్దుపెట్టుకున్నాడు. కుచ్చెళ్ళకు ఆనించుకొన్నాడు...

ఈ రోజుల్లో రైళల్లో ఎన్నో ఘోరాలు జరుగు తున్నాయి. మానభంగాలు, హత్యలు, దొంగతనాలు కోకొల్లలు. తను మరెవరితోడూ లేకుండా భార్యనూ, కొడుకునూ పంపించాడు. ఈ రాత్రి ఏమన్నా జరిగితే,

ఎవడో దొంగ, అమ్మడిగొంతు పిసికి, ఆగొలుసు లాక్కు-పోతే, లేదా- నోటికి గుడ్డకట్టి.... చేస్తే, లేదా చంపితే, కొడుకును కిటికీలోంచి—బైటికి విసిరితే! అసలు రైలే పడిపోతే? ...

పీతాంబరం వణికిపోయాడు. ఛటుక్కున లేచి, రైలు స్టేషనుకు పరుగెత్తాడు. స్టేషనుమాస్టరుదగ్గరకెళ్ళి, "రైలు పడిపోయిందా?" అనడిగాడు.

"ఏ రైలయ్యా!" అన్నాడతను విచిత్రంగా పీతాం-బరంకేసి చూస్తూ.

"సాయంత్రం బెజవాడకు బయలుదేరిన రైలు" అన్నాడు పీతాంబరం,

పీతాంబరంకళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"చెప్పండి సార్!" అన్నాడు పీతాంబరం, వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ.

ఏమీ చెప్పకుండానే, స్టేషనుమాస్టరు, కిటికీ తలుపులు వేసేసుకొన్నాడు.

ఆ తరువాత నాలుగు రోజులూ, వరసాగ్గ పేపరు చూశాడు పీతాంబరం: ఎక్కడన్నా రైళ్లు పడిపోయినవార్తలున్నాయేమోనని! అదృష్టవశాత్తూ లేవు. పీతాంబరం సంతోషంతో భుజాలెగరవేశాడు.

మూడు నెలల తరువాత, భార్య ఉత్తరం రాసింది-ఫలానా బండికొస్తున్నానని!

"పోయిందనుకొన్న వెధవ జిడ్డు మళ్ళీ దాపరిస్తోంది! ఆ రైలుకాస్తా బోల్తాపడి, చావగూడదూ?" అనుకొన్నాడు పీతాంబరం.

అలాంటి ఆపదలేమీ లేకుండా సురక్షితంగా తిరిగి వచ్చినందుకు, లోలోపల చాలా విచారించాడు పీతాంబరం....

"ఒకరికి ఇద్దరు పిల్లలు! పెళ్ళామే బరువనుకొంటుంటే, పైగా పిల్లలు! పానకంలో పుడకలు" అనుకొనేవాడు పీతాంబరం.

భార్యను చూసినప్పుడల్లా, అతనికి ఓడరేవు జ్ఞాపకమొచ్చేది!

"ఈ రెండింటికి ఏమీ భేదంలేదు" అనుకొనేవాడు పీతాంబరం.

"సరుకులు ఎక్కించుకోవడం, దింపించుకోవడం అక్కడా ఇక్కడాగూడా జరుగుతూంటాయి. ఓడరేవులకూ విసుగుండదు, భార్యలకూ విసుగుండదు. రెండూ రెండే! ఎగుమతి దిగుమతుల కూటాలు!" అని గొణుక్కునేవాడు పీతాంబరం.

అన్నింటిమీదా అసహ్యం, అన్నింటిమీదా అసంతృప్తి, ఏదో చెయ్యాలన్న తపన, ఏమీ చెయ్యలేని అసమర్థత, ఏదోఇరుకు, ఉక్క, గింజాటన, గింజులాట, తడబాటు, భయం, కసి, కోపం, రోత, ఇవే మిగిలాయి పీతాంబరానికి.

పీతాంబరానికి టీ అంటే చాలా యిష్టం! (డబ్బులున్న రోజుల్లో) అస్తమానూ టీ తాగడం, అతని కో సరదా! పంచదార ఎంత తక్కువైతే అంత మజాగా ఉంటుందంటాడు పీతాంబరం.)

మెహిందీ వీధిలో హోటలు పిటపిటలాడుతున్నప్పుడు, రేడియో గోలచేస్తున్నప్పుడు, మూలకొరిగిన పాత కుర్చీలో చేరగిలబడి, కళ్ళు మూసుకు ముడుచుకోవడం పీతాంబరానికి చాలా ఇష్టం!

గడియారంపాటకు పరుగులెత్తే కూలిజనం, ఇంక్ వాసన, కాగితాలగలగలలు, నౌకరునుదుటిచెమట, వెక్కిరించేబల్ల, ముక్కబోయిన కుర్చీ, తీసేసిన చెప్పులు, చెమటకుమాగిన సాక్కాలోంచి, నలిగిన పైజమాలోంచి, నడిచే శరీరం ... డబుల్ డెకడ్ బస్సులో Exit దగ్గర వేళ్ళాడే పంజాబీ అమ్మాయి, బస్సు కుదుపుకు ఊగే రొమ్ములు, గాలికి ఎగిరే పమిట, గిలగిలలాడే జుట్టు, గంటమోత, బస్సు మూలుగు, రేగిన పొగ, దేడ్ సౌర్ ఆఠానా, ఏకనాకో, మిఠాపానీ, లకిడీకాపూల్ స్టాప్ ... Yes .... Right ... జారేబళ్ళు, ఊగేబల్లు, అమ్మో - ముసలమ్మ, అమ్మలగన్న యమ్మ, ముగురమ్మల మూలపు టమ్మ, చాలా పెద్దమ్మ, సురారులమ్మ....కడుపారడిబుచ్చెడి యమ్మ ... దీం దుంప తెగా, అబ్బో చంపేశావయ్యా! శాన్ ఫ్రాన్సిస్కో కోశాంబికి రాజెవండు కాసబియాంకా, అన్నులమిన్నా, వెన్నెలకన్నా రావే రావే రవ్వలగున్నా ... అరటి తొక్కలు, చాయ్ గరం, రిబ్బనులు, చుట్ట, బీడి, సిగరెట్ ... ప్లాజాలో .... వారె మేర రాణీ, నీ వొంటిమీద వోణీ, నల్లబాలిక, తల్లి పోలిక, ఏక్ పైసా దేవ్ మారాజా ... అమ్మముండా, ఏమిటే నీవగలు, ఏమయ్యోవ్, ధాం ధమాకం, ఆడవాళ్ళున్నారు చూసి రావయ్యా! నా బంగారుకొండే, శారమణీ రారా

ఇలా పక్కనకూచో, ఎలా మోస్తున్నావే నా తల్లీ అంత లావుపాటివి! ఆరే పాల కేంద్రం, పాలుపొంగిన భాగ్యసీమది, ఆసి నీ నోట పంచదారపొయ్య, అమాంతం ఆనుక్కూచున్నావేం... అబ్బో, తల్లో చెమ్టా, కాళ్ళకు చెమ్టా మొఖాన చెమ్టా, గోళ్ళకు చెమ్టా, 'కుశలమస్తు భవచ్ఛాత కుంభి కుంభ, జంభ భిత్కుంభి కుంభాభి జృంభమాణ, భూరి భవదీయ వక్షోజములకు మేరు, మందరములుండు పర్యంత మిందు వదన'... రోడ్డుకు ఇంకా గతుకులుంటే, బస్సింకా ఊగితే, ఆవిడ ఇంకా తూగితే, ఏమో ఎవడికి తెలుసు రాఫుల్లాయ్! ఫుల్లయ్య తాతా, క్షేమంగా ఉన్నావా? ఉత్తరమేనా రాశావుగాదు. కందిచేలో కనకమ్మతో కుస్తీ, సుబ్బా యమ్మా! మబ్బుల్లో మాటలు, మనిషిలోని నిపసరం, అయ్యో లతా! అత్తింటికి వెళ్ళబోకు.

"సారికి సాయగతారి హేల తుంబర
కౌకుటి మాయగతారి హేల తుంబర నిలాసహి
కొంబెలి బింబిగాతరి, హేలా నిలాసహి
లాజాహోబు ఆలగు హేలా, నిలాసహి
లాబి ఉరియ డిట్నట హేలా నిలాసహి
అతంగ హంగుడ కాకరి హేలా నిలాసహి...." *

జర్రా ఠైరో బాబా! కైకూరే....నో....నో... మిస్టర్ జలావ్, రైట్ డబల్ రైట్. బస్సు కదిలింది.

---

* చంద్రునిముఖమును పోలిన, ఓ ప్రేయసీ! మిణుగురు పురుగులాగా మెరుస్తున్నావు, నవయౌవనంతో, నిమ్మ పండులాగా తొణికిసలాడుతున్నావు...

దుమ్ము రేపింది, మూల తిరిగింది. మాయమయ్యింది.... అందమైన పత్రికలు, పిలుస్తున్న సినిమా హాలు, గొల్లుమని నవ్వులు, గాజుల గలగల, సైకిల్ గంట.... మిఠాయి కొట్లు, చిఠారు కొమ్మన.... 'నీ కోసమేరా నా యవ్వనం, రారా ప్రియా, కౌగలించంగనూ'

"ఏమోయ్ పీతాంబరం ఎక్కడికిలా వచ్చావ్?" దూరంనించి కేక.

నిన్న రాతిరి కలలో వచ్చి,

చెంపచేరీ ముద్దులాడి....

"పెందరాడే వచ్చినట్టున్నావేమోయ్!" అన్నాడు సీతాపతి.

"ఏమిటీ" అంటూనే వణికిపోయాడు పీతాంబరం.

లాల్‌చంద్ ధూపాచంద్ సిల్కు ఎంపోరియంముందు ప్రొపయిటరు కారు, ప్రక్కనే సీతాపతి పెళ్ళాం, కొట్లో ప్రొప్రయిటరు....

"అయిదింటికే వచ్చాను సీతాపతీ!" అన్నాడు పీతాంబరం.

("ఒరి నీ కారు మండ, నీడలా వెంట పడుతున్నావేమిరా!" అనుకున్నాడు పీతాంబరం.)

"ఏమండీ, రారూ! వారు పిలుస్తున్నారు" అన్నది సీతాపతి భార్య, భర్తకేసి చెయ్యి ఊపుతూ, కొట్లోకి చూస్తూ, పమిట సరిచేస్తూ, కుచ్చెళ్ళు దులుపుతూ...

("పోరా నాప నాకొడక! పెళ్ళాం పిలుస్తోంది. ఏం

భామామణీ! ఈ రాత్రి సీతాపతిఇంటికొచ్చే ప్రాప్తంలేదా!"
అనుకున్నాడు పీతాంబరం.)

"వస్తానోయ్" అన్నాడు సీతాపతి.

"వస్తానోయ్" అన్నాడు పీతాంబరం.

రోడ్డంట పోతే అరమైలు చుట్టు. పబ్లిక్ గార్డెన్సు లోంచి పోతేనే మంచిది. రంగు రంగు దీపాలు. ఊగే నీడలు, నిలవనీరు వాసన, రైలు కూతలు, ఫౌంటెన్ ప్రక్కన హెడీలామర్ పడుకొన్న బొమ్మ, దూరంగా సైకిల్ పోతున్న జర జర.... అటూ ఇటూ చూసి, బొమ్మను రాచుకుంటూ వెళ్ళాడు పీతాంబరం. 'హాయ్ హాయ్' అనుకొన్నాడు పీతాంబరం. అద్భుతం అనుకున్నాడు పీతాబరం. ఆనందం పట్టలేకపోయాడు పీతాంబరం.
చిటికవేసి, మెటిక విరుచుకున్నాడు పీతాంబరం.

"ఇంత పొద్దుపోయిందేమండీ!" అన్నది పీతాంబరం భార్య!

("ఓసి నీ వలపు వల్లకాట్లో కలవ___పోవే!" అనుకొన్నాడు పీతాంబరం.)

"ఎక్కౌంట్స్ పేరుకుపోయాయి అమ్మడూ!" అన్నాడు పీతాంబరం.

"రామనాథంగారొచ్చారు" అన్నది భార్య.

("ఎన్నిసార్లు చెప్పనురా భగవంతుడా!" అనుకొన్నది భార్య.)

"రేపిచ్చేదాంగానీ, పిల్లలునిద్రపోయారా!"అన్నాడు పీతాంబరం.

"ఇప్పుడేనండీ!" అన్నది భార్య లోపలి కెడుతూ.

("చేతావాతాగానివాడికి పిల్లలుకూడా ఎందుకో!" అనుకొన్నది భార్య.)

పీతాంబరం భార్యకేసి చూశాడు గానీ, చీకట్లో పిరుదులు ఊగటం కనిపించలేదు.

దేన్ని గురించీ ఆట్టే కాలం ఆలోచించలేకపోవడం పీతాంబరం ప్రత్యేకత. ఉన్న కాస్సేపయినా, బుద్ధి తిన్నగా ఉండకపోవడం మరో ప్రత్యేకత. (లోగడనే మనం చెప్పుకున్నట్లు) అతని ఆలోచనలు, చాలా చిత్రంగా ఉంటాయి. ఆకుకు అందకుండా పోకకు పొందకుండా ఆలోచించడం పీతాంబరానికి అలవాటయింది....

ఒకసా రతను వీధిలో నడుస్తుండగా, బాబుకు జ్వరం తగులుతున్న సంగతి ఉప్పెనగా జ్ఞప్తికొచ్చింది. ఇంటినుండి తనొచ్చేటప్పుడే బరువుగా వుంది. చేతిలో డబ్బు లేదు. సరైన మందుల్లేవు. రోజు రోజుకూ బాబు ఎండిపోతున్నాడు. ఎడ తెరిపిలేకుండా దగ్గుతున్నాడు. మరీ వారం రోజులు నుండీ దగ్గువెంట నెత్తురుకూడా పడుతోంది. బాబుప్రాణం గంటలమీద-ఒకటి రెండు గంటలమీదవున్నదని అందరూ అనుకొన్నారు. తన కళ్ళెదటనే, తనకొడుకు నిస్సహాయంగా మరణించడం పీతాంబరం చూడలేకపోయాడు. ఇప్పుడే వస్తానని బయలుదేరాడు. వచ్చిగూడా అయిదారు గంటలైంది. ఈ పాటికి బాబు చనిపోయే ఉంటాడు! వాణ్ని గదిలోంచి తెచ్చి బాదంచెట్టుకింద పడుకోబెట్టి ఉంటారు. అమ్మడు బాబును కావలించుకొని, గుండె పగిలేలా

ఏడుస్తూ ఉంటుంది. అమ్మ ఎందు కేడుస్తూందో తెలీక రేవతి, బిక్కు బిక్కుగా చూస్తూ, తనూ ఏడుస్తూంటుంది. బాబువంటినిండా చీమలు పట్టటం, వొళ్లు బిగుసుకు పోవటం.... బాబు! తన బాబు!! తన చిన్నారి తండ్రి, తన వంశాకురం!!! ఎంత బావుంటుంది వాడి మొఖం. అచ్చు తల్లి పోలికలే! పచ్చని ముఖం, గుండ్రని తల, నల్లజుట్టు, మెత్తని చేతులు. ఇంటి కెళ్ళంగానే, "నాన్నా!" అంటూ కాళ్ళకు చుట్టుకునేవాడు, "ఏం తెచ్చావు నాన్నా?" అనే వాడు. ఇప్పుడు తన్నెవరలా అడుగుతారు? రేవతి "అన్నయ్య చూలు నాన్నా" అని ఎవర్ని చూపించి అడుగుతుంది. 'అన్నయ్యేలే?' అంటే ఏమిటి చెప్పడం తను?

"బాబూ! నా బాబూ!"

బిగ్గరగా అరచి రెండుచేతులూ ముఖానికి కప్పుకొని, సర్వస్వం ధ్వంసమైనవాడిలా, ఘొల్లుమని గోలపెట్టాడు పీతాంబరం.

... చీకటి పడుతోంది. దీపాలు వెలిగిస్తున్నారు. తడారిపోయిన కళ్ళతో చుట్టూ చూశాడు పీతాంబరం. దీపాలు ఊపుకొంటో బళ్లు పరుగెత్తుతున్నాయి. రేడియో పాడుతూనే వుంది. వ్యాపారం సాగుతూనే వుంది! నవ్వులు వినపడుతూనే ఉన్నాయి. అంతా సజావుగా, సాఫీగా నడుస్తోంది! ఏదో ఓ ప్రళయం జరక్కుండా, ఈ ప్రపంచం చాలా మామూలుగానే వున్నందుకు, పీతాంబరం ఆశ్చర్యపోయాడు.

పార్కు మూల కొచ్చాడు. అమీర్ బాషా మిరప కాయ బజ్జీలు వేస్తున్నాడు. పీతాంబరాన్ని చూసి, 'ఆయియే జనాబ్!' అన్నాడు నవ్వుతూ.

ఓ బండిమీద అరటిగెల లున్నాయి. వెనుక వేపున అయిదేళ్ళ కుర్రవాడు కాళ్ళు ముడుచుకు పడుకున్నాడు. తండ్రి బండిని నెట్టుకెడుతున్నాడు. 'పాపం! వయస్సుకు మించిన శ్రమకు ఆగలేకపోయాడుగావును కుర్రాడు' అను కున్నాడు పీతాంబరం.

'కొందరిలా దుర్భర దారిద్ర్యం అనుభవించడానికీ, మరికొందరు సుఖపడడానికీ, కర్మ కారణం కానేకాదు. అంతకుమించిన కారణం ఏదో ఉండి ఉండాలి. అదేదో తనకు అంతుచిక్కడంలేదు. కొట్లనిండా గుడ్డల తానులు మూలుగుతున్నాయి. కానీ, అర్ధనగ్నంగా కోట్లాది మానవులు బాధపడుతున్నారు. గింజలు గోదాముల్లో ముక్కిపో తున్నాయి: కేవలం తిండిలేక లక్షలాది ప్రజ నకనకలాడి పోతున్నారు. బీరువాలనిండా మందులున్నాయి. కానీ— మందుల్లేక, మనుషులు చస్తున్నారు. నాగలంటే తెలీని సోమరికి, వేలాది ఎకరాల పొలంవుంది. మట్టిలోపుట్టి, మట్టిలో పెరిగి, మట్టిలోనే కలిసిపోయేవాడికి, సెంటుభూమి లేదు. ఇద్దరు మనుషులకు నాలుగంతస్తులమేడ; పదినిమిది చదరపు గజాల స్థలంలో, పదహారుమంది ఎలకల్లా ఉంటు న్నారు - ఏమిటీ వైపరీత్యం? ఎందు కిలా జరుగుతోంది? ఏమిటి దీనికి నివారణ? మానవు డిలా ఎంత కాలం మరణిస్తుం టాడు?...'

పీతాంబరం తల చిటచిటలాడిపోయింది. జుట్టు పీక్కోబుద్ధేసింది. ఎత్తయిన కొండమీదినించి, లోయలోకి దూకాలనిపించింది. పొట్ట చింపుకొని, పేగులు మెళ్ళోవేసుకొని, శివ తాండవం చెయ్యాలనిపించింది. కనిపించిన ప్రతివాడి ముఖానా కొక్కరించి ఉయ్యాలనిపించింది. డబ్బంతా ఓచోట పోగేసి నిప్పు ముట్టించాలనిపించింది.

పీతాంబరం ఇంటికొచ్చేసరికి ఎనిమిది గంటలైంది. భార్య, తెల్లవాయిల్ చీరకట్టుకొంది. నీలంరంగు జాకెట్ వేసుకొంది. తల్లో ఇన్ని మల్లెపూలూ, మధ్యనో గన్నేరుపువ్వూ తురుముకొంది. పలచగా పౌడరు రాసుకొంది. కాటుకగూడా పెట్టుకున్నదేమో, కళ్లు చాలా అందంగా వున్నాయి. భర్తను చూడగానే నవ్వుతూ లేచింది, తగి లేంత దగ్గరగా వచ్చింది.

"ఇప్పటిదాకా ఏం చేస్తున్నారండీ!" అన్నది భార్య గుండీలు సర్దబోతూ.

వెర్రివాడిలా భార్యకేసి చూశాడు పీతాంబరం. అతని తల తిరిగిపోతూ ఉంది. తూలకుండా భార్య భుజం పట్టుకొన్నాడు.

"బాబు - బాబెక్కడ?" అన్నాడు పీతాంబరం.

అతని గుండెలు గుబగుబలాడాయి. కళ్ళుమూసుకొన్నాడు.

"ఇప్పటిదాకా మీకోసం చూసి చూసి, ఇప్పుడే కన్నుమూశాడు" అన్నది భార్య.

పీతాంబరం గబగబా లోపలికి పరిగెత్తుకొచ్చాడు. మెడదాకా దుప్పటి కప్పుకొని పడుకునున్నాడు బాబు. లైటు వెలుతురులో ముఖం అమాయకంగా ఒంపుతిరిగింది. అమాంతం కొడుకును కావలించుకొని, 'బాబూ! బాబూ!!' అంటూ బిగ్గరగా ఏడిచాడు పీతాంబరం.

* * *

"మానవుడు మరణిస్తున్నాడు!" అన్నాడు దేవుడు దిగులుగా.

"ఆమెన్!" అన్నది దయ్యం, ఉప్పొంగిపోతూ.